తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :360 | సోమవారం | 05-07- 2026 | పేజీలు: 4 | వెల రూ. 03



తెలంగాణ వెన్నెల వాక్కు
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో


# మెట్రో విస్తరణకు వేగం..

## కేంద్రానికి సీఎం రేవంత్ లేఖలు

### ఫేజ్-2కు వెంటనే అనుమతులు.. ఫేజ్-1 స్వాధీనం ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి



హైదరాబాద్:
హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణకు తక్షణ అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్-1ను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి విడివిడిగా లేఖలు పంపి ఈ అంశంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఇటీవల జూన్ 23, 24 తేదీల్లో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను సీఎం లేఖల్లో ప్రస్తావించారు. ఆ సమావేశంలో మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువ నిర్ధారణ, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ, అలాగే ఫేజ్-2 విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర నోడల్ సంస్థ ఎస్‌బీఐ క్యాప్స్‌ను నియమించాలని ఉమ్మడిగా నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు.

2

# గిరిజన యువతే భారత్ సెమీకండక్టర్ శక్తి..

## యువతను అభినందించిన ప్రధాని మోదీ



2

# కార్యకర్తల కోసమే మాట్లాడా..

## కాంగ్రెస్ కోసమే పనిచేస్తా: రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, జూలై 5:
తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు

2

# కాళేశ్వరంపై అధికార-ప్రతిపక్షాల మాటల యుద్ధం

# కేటీఆర్ సవాల్.. ఉత్తమ్ ఘాటు కౌంటర్



హైదరాబాద్, జూలై 5:
తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు మరోసారి ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయగా, మరోవైపు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. దీంతో కాళేశ్వరం అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.
కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించిన కేటీఆర్ మాట్లాడుతూ, గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మోటార్లు నడపడం లేదని ఆరోపించారు.
రాజకీయ కక్షతోనే రైతులకు

2



# క్యూర్’ బిల్లుతో హైదరాబాద్‌కు కొత్త పాలనా విధానం

## జీహెచ్ఎంసీ చట్టానికి గుడ్‌బై.. ప్రజాభిప్రాయానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం




హైదరాబాద్, జూలై 5:
హైదరాబాద్ మహానగర పరిపాలనలో సమూల మార్పులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు ఏడు దశాబ్దాలుగా అమల్లో ఉన్న జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా ‘కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026’ (జఖ=జు దీఆశ్రీశ్రీ) ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేసింది. నగర పరిపాలనను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో ఈ బిల్లును రూపొందించింది.
1955లో రూపొందిన చట్టం నాటి

2

# జర్నలిస్టుల సంక్షేమానికి సమష్టి కృషి అవసరం

## రైల్వే పాసుల పునరుద్ధరణకు కేంద్రంతో మళ్లీ చర్చిస్తా: బండారు దత్తాత్రేయ



హైదరాబాద్, జూలై 5:
జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, పాత్రికేయ సంఘాలు సమన్వయంతో పనిచేయాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీజేఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.
ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని,

2

# మెట్రో విస్తరణకు వేగం..

అయితే ఇప్పటివరకు కేంద్ర గృహనిర్మాణ శాఖ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (ఠశీ=)ను ఖరారు చేయకపోవడంతో పాటు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆలస్యం కారణంగా మెట్రో ఫేజ్–1 నిర్వహణలో అనిశ్చితి నెలకొనడమే కాకుండా, ఫేజ్–2కు సంబంధించిన డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు కూడా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరానికి మెట్రో రైలు విస్తరణ అత్యంత అవసరమని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు అమలులో జాప్యం జరిగితే వ్యయం మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, మెట్రో ఫేజ్–1 స్వాధీనం, ఫేజ్–2 విస్తరణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇద్దరు కేంద్ర మంత్రులను కోరారు.

కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఇప్పటికే జరిగిన ఒప్పందాల అమలు వేగవంతమైతే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కొత్త ఊపు వస్తుందని, నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ముఖ్యమంత్రి తన లేఖల్లో పేర్కొన్నారు.

# క్యూర్' బిల్లుతో హైదరాబాద్‌కు కొత్త పాలనా విధానం

పరిస్థితులకు అనుగుణంగా ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి మెట్రో నగరంగా విస్తరించిన నేపథ్యంలో సమగ్ర పట్టణ పాలన అవసరమైందని ప్రభుత్వం పేర్కొంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే నగరంలోని పలు ప్రభుత్వ శాఖల సేవలు ఒకే వేదికపైకి రావడంతో ప్రజలకు సేవలు వేగంగా అందే అవకాశం ఉంది. మున్సిపల్ అనుమతులు, ధ్రువపత్రాలు, ఇతర సేవలను పూర్తిగా డిజిటల్ విధానంలో అందించేందుకు ప్రతిపాదనలు చేశారు.

నగరాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా బిల్లులో ప్రాధాన్యం కల్పించారు. 'నెట్ జీరో కార్బన్' లక్ష్యంతో భవిష్యత్ నిర్మాణాలు, రవాణా వ్యవస్థలు, పచ్చదనం పెంపు వంటి అంశాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసేలా నిబంధనలు రూపొందించారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, డ్రైనేజీ, ప్రజారోగ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు స్థానిక సంస్థలకు అధిక అధికారాలు కల్పించే ప్రతిపాదనలు ఉన్నాయి.

పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు అనుగుణంగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు అనుమతుల ప్రక్రియను సరళీకృతం చేయనున్నారు. నగరాభివృద్ధిలో సాంకేతికత వినియోగాన్ని పెంచడంతో పాటు పౌర సేవలను వేగవంతం చేసేలా బిల్లులో ప్రత్యేక నిబంధనలు చేర్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే తుది చట్టాన్ని రూపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ముసాయిదాను బహిరంగంగా విడుదల చేసింది. జూలై 24, 2026 వరకు ప్రజలు, నిపుణులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పరిశ్రమల ప్రతినిధులు తమ సూచనలు, అభ్యంతరాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు. వచ్చిన సూచనలను పరిశీలించిన అనంతరం బిల్లులో తగిన మార్పులు చేసి శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు, సమగ్ర పట్టణ పాలనకు ఈ 'క్యూర్' బిల్లు కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# గిరిజన యువతే భారత్ సెమీకండక్టర్ శక్తి..

న్యూఢిల్లీ/సనంద్:

గుజరాత్‌లోని సనంద్‌లో ఇటీవల ప్రారంభమైన సీజీ సెమీ ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ూూూ) కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ పనిచేస్తున్న యువతతో జరిగిన సమావేశం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

ఈ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ఉండటం విశేషమని ప్రధాని పేర్కొన్నారు. వీరిలో చాలామంది దేశంలోని మారుమూల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు చెందిన వారేనని చెప్పారు. సెమీకండక్టర్ రంగంపై ఎలాంటి అనుభవం లేకపోయినా, శిక్షణ పొంది ఇప్పుడు అత్యాధునిక సాంకేతిక రంగంలో తమ ప్రతిభను చాటుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు.

భారత సెమీకండక్టర్ రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో యువత పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని ప్రధాని మోదీ అన్నారు. కష్టపడి నేర్చుకోవాలనే తపన, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకునే నైపుణ్యం భారత యువతకు ఉన్న గొప్ప బలమని ఆయన పేర్కొన్నారు.

"భారత్ యువశక్తి పట్ల నాకు ఎంతో గర్వంగా ఉంది. దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత, ముఖ్యంగా మహిళలు మరియు గిరిజన ప్రాంతాలకు చెందిన యువకులు, యువతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి కృషి భారతదేశాన్ని ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ముందుకు తీసుకెళ్తుంది" అని ప్రధాని మోదీ అన్నారు.

ఈ సందర్భంగా యువ ఉద్యోగులతో జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియోను కూడా ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియోకు విశేష స్పందన లభిస్తోంది.

# జర్నలిస్టుల సంక్షేమానికి సమష్టి కృషి అవసరం

ప్రజలకు నిజాయితీతో కూడిన సమాచారాన్ని అందించే పాత్రికేయుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్య బీమా, గృహ వసతి, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాలను కోరారు.

జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణ అంశాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చారు. పాత్రికేయుల వృత్తిపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సౌకర్యాన్ని తిరిగి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సమావేశంలో టీజేఏ అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం టీజేఏకు అధికారిక గుర్తింపు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేశామని, సభ్యత్వాన్ని మరింత విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపునకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బండారు దత్తాత్రేయకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉక్కల్కర్ రాజేందర్ నాథ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల రైల్వే పాసుల అంశాన్ని పలుమార్లు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎన్‌యూజే(ఐ) నిరంతరం కృషి చేస్తోందన్నారు.

టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు మాట్లాడుతూ, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ ద్వారా అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఏ.ఎస్. రావు, ఎన్‌యూజే(ఐ) కార్యవర్గ సభ్యుడు ధన్నారపు రాజలింగం, టీజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరీ, ఉపాధ్యక్షుడు ఖాసీం, కార్యదర్శి నాగస్వామి, కోశాధికారి ఖలీల్ అహ్మద్, మాజీ ఉపాధ్యక్షుడు చింతల నీలకంఠం, వివిధ జిల్లాల అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై అధికార-ప్రతిపక్షాల మాటల యుద్ధం

సాగునీరు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేతకాకపోతే కాళేశ్వరం ప్రాజెక్టును మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అప్పగించాలని, ఆయనే స్వయంగా వచ్చి మోటార్లు ప్రారంభించి రైతులకు నీళ్లు అందిస్తారని సవాల్ విసిరారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే పరిస్థితి ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేడిగడ్డ వద్ద నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వం ప్రతిపక్షాలను ప్రాజెక్టుల వద్దకు కూడా వెళ్లనివ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం తెలంగాణ రైతాంగానికి జీవనాడి అని, దానిని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. వెంటనే పంప్ హౌస్‌లను ప్రారంభించి సాగునీరు అందించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

అదే సమయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో ప్రస్తుతం నీటిని నిల్వ చేయడం ఏమాత్రం సురక్షితం కాదని తెలిపారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (చీణూూ) నివేదిక ప్రకారం బ్యారేజీల పునాదులు దెబ్బతిన్నాయని, అలాంటి పరిస్థితిలో నీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని వివరించారు.

బలవంతంగా నీటిని నిల్వ చేస్తే బ్యారేజీలకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, దిగువ ప్రాంతాల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చని హెచ్చరించారు. అందుకే నిపుణుల సూచనల మేరకు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వమే తప్పుడు డిజైన్లు, అవినీతి కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఈ పరిస్థితికి తీసుకొచ్చిందని ఉత్తమ్ ఆరోపించారు. వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసి రాష్ట్రంపై భారీ అప్పుల భారం మోపారని విమర్శించారు. బ్యారేజీలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తై నిపుణుల అనుమతి వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాళేశ్వరం అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు మరింత తీవ్రతరం కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఇది హాట్ టాపిక్‌గా మారింది. రైతుల ప్రయోజనాల పేరుతో ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పిస్తుండగా, కాళేశ్వరం భవిష్యత్ నిర్వహణపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై అందరి దృష్టి నెలకొంది.

# ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక

## "తలచుకుంటే ఇరాన్ అగ్రనేతలను ఒక్క దెబ్బతో అంతమొందించగలం"



వాషింగ్టన్, జూలై 5:

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా తలచుకుంటే ఇరాన్ అగ్రనేతలను ఒక్క దెబ్బతో అంతమొందించే శక్తి తమకు ఉందని, అయితే భవిష్యత్ దౌత్య చర్చలను దృష్టిలో పెట్టుకుని అలాంటి చర్యలకు దిగలేదని వ్యాఖ్యానించారు.

మీడియాతో మాట్లాడుతూ, అమెరికా సైనిక సామర్థ్యం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనదని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ దేశంతో భవిష్యత్తులో చర్చలు జరిపేందుకు నాయకత్వం ఉండాలనే ఉద్దేశంతో సంయమనం పాటించామని తెలిపారు.

ఇరాన్ ప్రస్తుతం ఆర్థిక, రాజకీయ పరంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, అమెరికాతో శాంతి ఒప్పందం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. గతంలో అమెరికా విధించిన ఆంక్షల ప్రభావం ఇరాన్‌పై తీవ్రంగా పడిందని ఆయన అన్నారు.

ఇటీవల జరిగిన కొన్ని అంతర్జాతీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, ఇరాన్‌కు సంబంధించిన అంశాల్లో అమెరికా వ్యూహాత్మకంగా వ్యవహరించిందని ట్రంప్ తెలిపారు. తన వ్యాఖ్యల ద్వారా ఇరాన్‌పై మరోసారి ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు.

ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# కార్యకర్తల కోసమే మాట్లాడా..

అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకాల అంశంపై తాను ముక్కుసూటిగా మాట్లాడానని పేర్కొన్నారు. ప్రభుత్వం లేదా పార్టీ అధిష్ఠానాన్ని విమర్శించడం తన ఉద్దేశం కాదని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల మనోభావాలను మాత్రమే వ్యక్తం చేశానని తెలిపారు.

ఇటీవల యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు నియామకాల్లో స్థానిక ప్రజాప్రతినిధిగా తనను సంప్రదించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న నల్గొండ సభకు ఆయన గైర్హాజరు కావడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

ఈ నేపథ్యంలో స్పందించిన రాజగోపాల్ రెడ్డి, పార్టీ బలోపేతమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ధ్యేయమన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని చెప్పారు.

ఇటీవల రాహుల్ గాంధీని కలిసి తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ కార్యకర్తల ప్రయోజనాల కోసమే తన అభిప్రాయాలను వ్యక్తం చేశానని, పార్టీ ఐక్యతకు తాను కట్టుబడి ఉంటానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో గత కొద్దిరోజులుగా సాగుతున్న అంతర్గత విభేదాల ఊహాగానాలకు కొంతవరకు తెరపడినట్లయింది.

# నిర్మల్ డిపో నుండి రామేశ్వరానికి బయలుదేరిన ఆర్టీసీ ప్రత్యేక యాత్రా బస్సు




నిర్మల్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఆర్టిసి) నిర్మల్ డిపో ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక యాత్రికుల కొరకు కేటాయించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన రామేశ్వరం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఆదివారం మధ్యాహ్నం నిర్మల్ బస్టాండ్ నుండి బయలుదేరినట్లు డిపో మేనేజర్ కే పండరి తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు నిర్మల్ నుండి బయలుదేరి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కానిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, పాతాళషెంబు, మదురై గుండా రామేశ్వరం వెళ్లి, తిరుగు ప్రయాణంలో కంచిపురం, శ్రీకాళహస్తి క్షేత్రాలను దర్శించుకుని తిరిగి నిర్మల్ చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవల పట్ల నమ్మకం ఉంచినందుకే ఇలాంటి సుదీర్ఘ యాత్రా సర్వీసులను విజయవంతంగా నడుపుతున్నామన్నారు. భవిష్యత్తులో ప్రయాణికుల కోరిక మేరకు గుజరాత్ లోని సోమనాథ్, ద్వారక వంటి పుణ్యక్షేత్రాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. గతంలో తమ డిపో నుండి కాశీ, అయోధ్య, ఉజ్జయిని, పూరి జగన్నాథ్, గోవా వంటి ప్రాంతాలకు విజయవంతంగా బస్సులు నడిపినట్లు గుర్తుచేశారు.

# పెద్దమ్మ తల్లి దేవాలయ ఆవరణలో ఆదర్శవంతంగా 'స్వచ్ఛ భారత్'



.ఆర్మూర్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):

ఆర్మూర్ పట్టణ శివారులో వెలసిన ప్రసిద్ధ పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బృహత్తర స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కలిసి ఆలయ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను, భక్తులు పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను, పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ, పెద్దమ్మ దేవాలయానికి ప్రతి ఆదివారం వందలాది మంది భక్తులు వస్తుంటారని, వారికి అసౌకర్యం కలగకుండా ఈ శుద్ధి కార్యక్రమం చేపట్టామన్నారు. 'ప్రతి ఆదివారం ఒక గంట' నినాదంతో గత 61 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజం మచ్చేందర్, పెద్దమనిషి బోండ్ల పెద్దులు, జంగడి శ్రీను, జక్కం ప్రసాద్, బోండ్ల గోపి, బీజేపీ నాయకులు పెంట జలంధర్, విజయానంద్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, గుర్రం రాకేష్ పాల్గొన్నారు.

# ఇందిర మార్క్ 'కఠిన జాతీయవాదం' నేటి కాంగ్రెస్‌కు ఎందుకు దూరమైంది?

## బీజేపీ జాతీయవాద రథం.. కాంగ్రెస్ దౌత్యపరమైన వైఫల్యాలు!

భారత జాతీయ రాజకీయాలు ప్రస్తుతం ఒక అత్యంత ఆసక్తికరమైన మరియు క్లిష్టమైన మలుపులో ఉన్నాయి. 2014 తర్వాతి పరిణామాలను గమనిస్తే, అధికార భారతీయ జనతా పార్టీ సంఖ్యాపరంగా లోక్‌సభలో పూర్తి మెజారిటీకి స్వల్పంగా దూరంగా ఉన్నప్పటికీ, దేశంలో ఒకే ఒక్క పార్టీ ఆధిపత్యం నడుస్తోందన్న భావనను ప్రజా బాహుళ్యంలో విజయవంతంగా సృష్టించగలిగింది. మరోవైపు, దేశంలోని ప్రాంతీయ పార్టీలు వివిధ రకాల రాజకీయ ఒత్తిళ్లకు లోనై క్రమంగా బలహీనపడుతున్న తరుణంలో, దేశవ్యాప్తంగా ఇప్పటికీ బలమైన ఉనికిని మరియు విస్తృతిని కలిగి ఉన్న ఏకైక ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మాత్రమే కావడం గమనార్హం. దీనివల్ల భారత రాజకీయం సిద్ధాంతపరంగా ద్విపాక్షిక పోటీగా మారింది. అయితే, ఈ పోటీని జాతీయ స్థాయిలో సమర్థవంతంగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ఒక పెద్ద వ్యూహాత్మక లోపంతో కొట్టుమిట్టాడుతోంది. అదే తన సొంత చారిత్రక పునాది అయిన 'కఠిన జాతీయవాదాన్ని' పూర్తిగా వదిలివేయడం. విశ్లేషణాత్మకంగా చూస్తే, నేటి కాంగ్రెస్ వైఖరికి, గత చరిత్రలోని కాంగ్రెస్ అగ్రనాయకత్వ సిద్ధాంతాలకు అస్సలు పొంతన కుదరడం లేదు.

ప్రస్తుతం దేశంలో భజపా ప్రధానంగా నాలుగు బలమైన సిద్ధాంతాల లేదా ఇంజన్ల ఆధారంగా తన రాజకీయ రథాన్ని వేగంగా ముందుకు నడుపుతోంది. అవి కఠినమైన హిందుత్వ, మరింత కఠినమైన జాతీయవాదం, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు నేరుగా చేరే సమర్థవంతమైన సంక్షేమ పథకాలు మరియు కంటికి స్పష్టంగా కనిపించే భారీ మౌలిక సదుపాయాల కల్పన. ఇందులో మొదటిదైన హిందుత్వ విషయానికి వస్తే, కేవలం ఎన్నికల సమయంలో దేవాలయాలను సందర్శించినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ బీజేపీతో సిద్ధాంతపరంగా పోటీ పడలేదు. ఈ విషయాన్ని ఒకప్పుడు శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే కూడా రచయితతో అంగీకరిస్తూ, తమ తండ్రి బాలాసాహెబ్ ఠాక్రే మహారాష్ట్రవాదం నుండి హిందుత్వ వైపు రాజకీయాలు మార్చడం వల్లనే నరేంద్ర మోదీకి మహారాష్ట్రలో సులభంగా అడుగుపెట్టి ఆ స్థానాన్ని ఆక్రమించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాల విషయంలో కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలు అద్భుతమైనవే అయినప్పటికీ, జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని, గ్రేట్ నికోబార్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పర్యావరణం పేరిట వ్యతిరేకిస్తున్నట్లు కనిపించడం ఆ పార్టీకి జాతీయ స్థాయిలో కొంత ప్రతికూలంగా మారుతోంది.

హిందుత్వ, మౌలిక సదుపాయాల వ్యూహాలను పక్కన పెడితే, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతపరంగా అత్యంత ఘోరంగా దెబ్బతిన్నది మాత్రం 'జాతీయవాదం' విషయంలోనే అని చెప్పక తప్పదు. నిజానికి అసలైన భారత జాతీయ కాంగ్రెస్ ఎప్పుడూ కేవలం శాంతిని మాత్రమే పలవరించే, సరిహద్దుల విషయంలో రాజీపడే బలహీనమైన శాంతియుత పార్టీ కాదు. దేశ చరిత్ర పుటలను ఒకసారి తిరగేస్తే, దేశ భద్రత మరియు సార్వభౌమత్వం విషయంలో అత్యంత కఠినమైన, దూకుడు నిర్ణయాలు తీసుకున్న ఘనత కాంగ్రెస్ ప్రధానమంత్రులకే దక్కుతుంది. జవాహర్‌లాల్ నెహ్రూ హయాంలో పోర్చుగీసు వారి నుంచి గోవా విముక్తి కోసం రక్షణ దళాలను పంపడం దగ్గరి నుండి, లాల్ బహదూర్ శాస్త్రి నేతృత్వంలో 1965 నాటి భారత్-పాక్ యుద్ధంలో పాకిస్తాన్‌ను సమర్థవంతంగా తిప్పికొట్టి కాశ్మీర్‌ను రక్షించడం వరకు కాంగ్రెస్ జాతీయవాదం ఎంతో బలంగా సాగింది.

?ముఖ్యంగా ఇందిరా



గాంధీ హయాంలో కాంగ్రెస్ చూపిన సైనిక చతురత, వ్యూహాత్మక దూకుడు అంతర్జాతీయ రాజకీయ చరిత్రలోనే అమోఘమైనదిగా నిలిచిపోయింది. 1971లో పాకిస్తాన్‌ను యుద్ధంలో ఘోరంగా ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి ప్రపంచ పటంలో బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేసింది ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే. అంతేకాదు, ఈశాన్య రాష్ట్రాలలో తలెత్తిన అంతర్గత తిరుగుబాటును అణచివేయడానికి 1966 మార్చి 5న ఐజ్వాల్‌లో వైమానిక దళాన్ని ఉపయోగించడం, ఆపరేషన్ బ్లూస్టార్ ద్వారా ఏకంగా అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంలోకి సైన్యాన్ని పంపి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడం వంటి అత్యంత కఠినమైన, వివాదాస్పద సైనిక చర్యలు ఆమె హయాంలోనే జరిగాయి.

ఈ కఠిన జాతీయవాద పరంపర రాజీవ్ గాంధీ మరియు పీవీ నరసింహారావు కాలంలోనూ కొనసాగింది. రాజీవ్ గాంధీ హయాంలో స్వర్ణ దేవాలయం చుట్టూ ఆపరేషన్ బ్లాక్ థండర్ నిర్వహించగా, పీవీ నరసింహారావు కాలంలో కాశ్మీర్ లోయ మరియు పంజాబ్‌లలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని, తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. నెహ్రూ-గాంధీ కుటుంబేతర ప్రధానమంత్రులైనప్పటికీ, జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ బలహీనమైన నాయకత్వాన్ని ప్రదర్శించలేదు. ఇంతటి ఉజ్వలమైన, కఠినమైన జాతీయవాద చరిత్ర కలిగిన ఒక గ్రాండ్ ఓల్డ్ పార్టీ, నేడు తన శైలిని పూర్తిగా మార్చుకుని వైరాగ్యం ప్రదర్శించడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పుల్వామా దాడి, ఆ తర్వాత భారత వైమానిక దళం జరిపిన బాలాకోట్ సర్జికల్ స్ట్రైక్స్, అలాగే లడఖ్ లేదా గల్వాన్ లోయ చైనా సంక్షోభం వంటి కీలక దేశభద్రతా సమయాల్లో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి ఆ పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది. సైనిక చర్యలపై బహిరంగంగా సాక్ష్యాలు అడగడం, రక్షణ దళాల సామర్థ్యాన్ని ప్రశ్నించేలా మాట్లాడటం వల్ల సాధారణ ప్రజల్లోకాంగ్రెస్‌పై భిన్నమైన, వ్యతిరేక అభిప్రాయం ఏర్పడింది. ఇటీవల రాహుల్ గాంధీ చైనా సరిహద్దు వివాదాలపై పార్లమెంట్‌లో స్పందించిన తీరు, దౌత్యపరంగా దేశ ప్రయోజనాలకు నష్టం చేకూర్చేలా ఉందనే విమర్శలు వచ్చాయి. భారతీయ జాతీయవాదం అనేది కేవలం ఒక నినాదం కాదు, అది ప్రాచీన, మధ్యయుగ చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం మరియు భారత రాజ్యాంగ స్ఫూర్తితో ముడిపడి ఉన్న ఒక ప్రత్యేకమైన భావన. ప్రస్తుతం బీజేపీ ఈ జాతీయవాదాన్ని హిందుత్వతో ముడిపెట్టి దేశవ్యాప్తంగా విజయవంతంగా వాడుకుంటోంది. దీన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ తన పాత వ్యూహాన్ని, ఇందిరా గాంధీ నాటి చతురతను గుర్తుకు తెచ్చుకోవాలి. గతంలో ఇందిరా గాంధీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా, సైన్యం సరిహద్దుల్లో సాధించిన విజయాలను మనస్ఫూర్తిగా ప్రశంసిస్తూనే, రక్షణ రంగంలో మరియు దౌత్యంలో ప్రభుత్వ వైఫల్యాలను రాజకీయంగా ఎండగట్టేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం సైన్యాన్ని, ప్రభుత్వాన్ని వేర్వేరుగా చూడటంలో ఘోరంగా విఫలమవుతోంది. చైనా సరిహద్దు అంశాన్ని కేవలం సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా విమర్శించడం వల్ల దేశ పౌరులు ఎవరూ ప్రభావితం కారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా తన సంకుచిత ధోరణిని మార్చుకుని, తన పూర్వపు కఠిన జాతీయవాద ముద్రను తిరిగి పునర్నిర్మించుకోకపోతే, దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యూహాత్మక లోపాన్ని త్వరగా సరిదిద్దుకోకుంటే, భారత రాజకీయంలో ద్విపాక్షిక పోటీ కాస్తా, పూర్తిగా ఏకపాక్షిక ఏకపార్టీ వ్యవస్థగా మారిపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## పెర్కిట్‌లో విద్యుత్ షాక్‌తో బోర్ మెకానిక్ పన్నీరు శ్రీనివాస్ మృతి

ఆర్మూర్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లో బోర్ మెకానిక్ గా పనిచేసే పన్నీరు శ్రీనివాస్ (వయసు 45 సంవత్సరాలు, తండ్రి చిన్నయ్య) ఆదివారం నాడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. పోలీసుల వివరాల ప్రకారం, శ్రీనివాస్ ఆదివారం ఉదయం 11:30 గంటల సమయంలో స్థానిక రైతు అల్లూరి నాగరాజు పొలంలో బోరు మోటారు రిపేరు పని చేయడానికి వెళ్లారు. అక్కడ ఆయన మోటారును బాగు చేస్తున్న క్రమంలో స్టార్టర్ డబ్బాకు ఉన్న సర్వీస్ వైరు నుండి ఒక్కసారిగా ప్రమాదవశాత్తు భారీ కరెంట్ షాక్ తగిలింది. దీంతో ఆయన వైరుకు అంటుకుపోగా, పక్కనే ఉన్న నాగభూషణం అనే వ్యక్తి వెంటనే అప్రమత్తమై పక్కనే ఉన్న కర్రతో కొట్టి శ్రీనివాస్ ను కరెంట్ వైరు నుండి విడిపించి కాపాడారు. అనంతరం తీవ్ర అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్ ను తక్షణమే ఆర్మూర్ లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ పరీక్షించిన డ్యూటీ డాక్టర్ ఆయన అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదకర ఘోర ఉదంతంపై మృతుడి కూతురు ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు ఆర్మూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి:

ఆర్మూర్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భీంగల్ మండల పరిధిలోని చెంగల్ గ్రామంలో మాదిగ కుల సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఆర్పిఎస్ భీంగల్ మండల కన్వీనర్ పాలేపు సత్యం మాదిగ ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సంఘం ముఖ్య నాయకుడు కనక ప్రమోద్ మాట్లాడుతూ, మాదిగ ఉప కులాల వర్గీకరణ అవశ్యకతను సుదీర్ఘంగా వివరించారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు సుమారు ముప్పై ఏళ్ల పాటు నిరంతర పోరాటం చేసి వర్గీకరణ చట్టాన్ని సాధించుకున్నారని గుర్తుచేశారు. ఈ వర్గీకరణ ద్వారా వచ్చే విద్యా, ఉద్యోగ అవకాశాలను మాదిగ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. అలాగే జూలై 7వ తేదీన నిర్వహించనున్న ఎంఆర్పిఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని చెంగల్ గ్రామంలో ఘనంగా జరుపుకోవాలని, అందులో భాగంగా నూతన జెండా గద్దెను నిర్మించి, జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నల్ల రాజు మాదిగ పాల్గొన్నారు.



## ఆర్మూర్ మార్కెట్ కమిటీలో రైతు భరోసా నిధుల విడుదల వేడుకలు

ఆర్మూర్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి రఘు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వాలు రైతాంగాన్ని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాణి సుమన్, శాల ప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ వాసు, జిమ్మీ రవి, చిక్కు సుభాష్, మహేందర్ తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## అష్ట గ్రామంలో ఐదు రోజుల ఊర పండుగ వేడుకలు సంపూర్ణం

ముధోల్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో గ్రామదేవతలకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సాంప్రదాయ ఊర పండుగ ఐదు రోజుల పాటు వైభవంగా కొనసాగి ఆదివారం ఘనంగా ముగిసింది. ముగింపు రోజున గ్రామదేవతల విగ్రహాలను గ్రామ ప్రధాన వీధుల్లో శోభాయాత్రగా ఊరేగించగా, డప్పు చప్పుళ్లు, మంగళహారతుల నడుమ భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ, మర్రవ్వ, ఉరాడవ్వ అమ్మవార్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు సక్రమంగా పండాలని దేవతలను ప్రార్థించారు. వీడీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలపై గ్రామ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ, పూర్వీకుల కాలం నుండి వస్తున్న ఈ పవిత్ర సంప్రదాయాన్ని అనవాయితీగా కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు కనకపురం ముత్యం, అజయ్ రెడ్డి, సూర్గుల భూమేష్, కండేలా అశోక్, కొంతం రాజేశ్వర్, ఉపసర్పంచ్ సావిత్ర, భక్తులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు సర్పంచ్ సొంత నిధుల కానుక

ఆర్మూర్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నా రెడ్డి ఆదేశాల మేరకు పల్లె గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. పార్దేమ్ మనీషా సంజీవ్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా పల్లె గ్రామ సర్పంచ్ ఉదారత చాటుకుంటూ ఇందిరమ్మ గృహప్రవేశాలు చేసుకున్న పేద లబ్ధిదారులకు తమ సొంత నిధుల నుండి విలువైన గృహోపకరణాల బహుమతులను (గిఫ్టులు) కానుకగా అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## బాసరలో మైసమ్మ, పోచమ్మ, మారెమ్మ అమ్మవార్లకు ఘనంగా బోనాలు

బాసర, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో మాదిగ కుల దేవుళ్లయిన శ్రీ మైసమ్మ తల్లి, శ్రీ గల్లీ పోచమ్మ తల్లి, శ్రీ మారెమ్మ తల్లి అమ్మవార్ల వార్షిక బోనాల వేడుకలను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాదిగ కుల సంఘం సభ్యులందరూ యదార్థ మనసుతో, దైవభక్తితో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సంరక్షణ కొరకు అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా మేకలను బలి ఇచ్చి కానుకలను సమర్పించారు. ఈ పవిత్ర వేడుకల్లో కుల పెద్దలు పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. కుల సంఘ ప్రముఖులు, అధ్యక్షులు అష్టం దేవన్న, ఉపాధ్యక్షుడు గుడ్డోళ్ల సందీప్, క్యాషియర్ దయాల చిన్నసాయిలు, బిద్దూర్ సాయిబాబా, ప్రధాన కార్యదర్శి పూర్ణం సాయిలు, గద్దల చిన్న దేవన్న, గద్దల నడిపి భోజన్న మాట్లాడుతూ, అమ్మవార్ల కరుణా కటాక్షాలు, చల్లని చూపులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నామన్నారు.



# పేదల సొంతింటి కల అరణ్య రోదన..

# అప్పుల ఊబిలో లబ్ధిదారులు!

నిర్మల్ జూలై 5 తెలంగాణ వెన్నెల వాక్కు
సొంత గూడు నిర్మించుకుని ఆత్మగౌరవంతో నిశ్చింతగా బతకాలని ఆశపడిన నిరుపేదలకు 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' ఇప్పుడు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. అధికారులు ఇచ్చిన నమ్మకంతో, అప్పులు తెచ్చి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గృహ ప్రవేశాలు సైతం అత్యంత వైభవంగా పూర్తి చేసుకున్న పేదలకు చివరి విడత బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు నిధుల నిలిపివేత భయం, మరోవైపు రోజురోజుకూ పెరిగిపోతున్న వడ్డీల భారంతో ఈ ప్రతిష్టాత్మక పథకం కాగితాలకే పరిమితమవుతోందా అనే ఆందోళన క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతోంది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఎంపికైన లబ్ధిదారులలో అత్యధికులు రోజువారీ కూలీలు, రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలే ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం సకాలంలో అందుతుందనే నమ్మకంతో, స్థానిక వడ్డీ వ్యాపారుల వద్ద భారీ మిత్తీలకు అప్పులు తెచ్చి పనులు ప్రారంభించారు. వానాకాలం ముంచుకొస్తుండటంతో నిర్మాణాలు పాడైపోతాయనే భయంతో మరికొందరు తమకున్న కొద్దిపాటి ఆస్తులను సైతం అమ్ముకుని స్లాబ్, ప్లాస్టరింగ్ పనులను పూర్తి చేశారు. తీరా జియో ట్యాగింగ్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలు పూర్తయినప్పటికీ, చివరి విడత నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమకాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. "పై నుంచి బడ్జెట్ రాలేదు" అంటూ అధికారులు చేతులెత్తేస్తుండటంతో, పేదల సొంతింటి కల కాస్తా అరణ్య రోదనగా మారుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బేస్‌మెంట్, రూఫ్‌లెవల్, స్లాబ్, మరియు ఫినిషింగ్ అనే నాలుగు దశల్లో నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పడాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు మూడున్నర లక్షల రూపాయల వరకు బిల్లులు నిలిచిపోయాయని లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు, ఇండ్లు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి హామీ పథకం




కింద తొంభై రోజుల వేతనం కల్పించే నిబంధన ఉన్నప్పటికీ, కొన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు సకాలంలో అందాలంటే లంచాలు ఇవ్వాల్సి వస్తోందని పలువురు లబ్ధిదారులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గందరగోళంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిర్మల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగంగానే సాగినప్పటికీ, నిధుల విడుదల దశకు వచ్చేసరికి లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఒక పక్క ప్రైవేటు వడ్డీల భారం పెరిగిపోతుండటంతో, తాము సంపాదించే రోజువారీ కూలీ డబ్బులు మొత్తం వడ్డీలకే సరిపోతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం తమను ఆర్థికంగా నిలబెడుతుందని ఆశిస్తే, అది కాస్తా అప్పుల ఊబిలోకి నెట్టేలా తయారైందని వారు ఆవేదన చెందుతున్నారు. సాంకేతిక కారణాల వల్ల లేదా బడ్జెట్ కొరత వల్ల బిల్లులు ఆగాయా అనే అంశంపై జిల్లా యంత్రాంగం స్పష్టతనివ్వాలి. క్షేత్రస్థాయిలో ఉన్న నిబంధనలను సడలించి, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా నిధులు చేరేలా చర్యలు తీసుకోవాలి. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న నిరుపేదలను తక్షణమే ఆదుకుని, వారి సొంతింటి కలను నిజం చేయాలని నిర్మల్ జిల్లా ప్రజలు మరియు లబ్ధిదారులు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను త్వరగా క్లియర్ చేయకపోతే, రాబోయే రోజుల్లో లబ్ధిదారులంతా కలిసి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# బాసర బాలాలయంలో వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన

.- ముగిసిన ప్రధాన ఆలయ దర్శనాలు.. ఇకపై బాలాలయంలోనే పూజలు, ఆర్జిత సేవలు

- 31 కోట్లతో 9 నెలల్లో పునర్నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యం: ఆలయ ఈఓ అంజనాదేవి



బాసర, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ చారిత్రాత్మక పునర్నిర్మాణ పనుల నేపథ్యంలో ముందస్తుగా అమ్మవారి క్షేత్రంలో గత మూడు రోజుల నుండి ప్రముఖుల తాకిడి విపరీతంగా పెరిగింది. అమ్మవారిని దర్శించుకున్న వారిలో నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మాజీ శాసనసభ్యుడు విఠల్ రెడ్డి పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1:00 గంట వరకు మాత్రమే సాధారణ భక్తులకు ప్రధాన ఆలయంలో దర్శనాలు కొనసాగాయి. ఆ తర్వాత ప్రధాన ఆలయంలో భక్తుల దర్శనాలను పూర్తిగా నిలిపివేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన బాలాలయంలో శృంగేరి పీఠం పండితుల వేదమంత్రాల సాక్షిగా, శాస్త్రోక్తంగా జ్ఞాన సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠాపన అనంతరం భక్తులకు బాలాలయంలో దర్శనాలు కల్పించారు. ఇకపై నిత్యపూజలు, అక్షరాభ్యాసాలు, అన్ని రకాల ఆర్జిత సేవలు బాలాలయంలోనే కొనసాగుతాయని ఆలయ ఈఓ అంజనాదేవి తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ దాతలు సూరపనేని సునంద్, పద్మప్రియ దంపతులు 31 కోట్ల రూపాయల సొంత నిధులతో రానున్న 9 నెలల కాలంలో సంపూర్ణ కృష్ణశిలలతో ఈ నూతన ప్రధాన ఆలయాన్ని నిర్మించి, గోదావరి పుష్కరాలకు భక్తులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఆదివారం జరిగిన పూర్ణాహుతి ప్రత్యేక పూజాది కార్యక్రమాలలో ఆలయ పునర్నిర్మాణ దాతలతో పాటు ముథోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లాలో 1.81 లక్షల మంది రైతులకు 222.42 కోట్ల రైతు భరోసా పెట్టుబడి సాయం

- రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ.. పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నాం: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వానాకాలం-2026 వ్యవసాయ సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద నిర్మల్ జిల్లాలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని నేరుగా జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 4వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 1,81,379 మంది రైతుల వ్యక్తిగత ఖాతాల్లో మొత్తం 222.42 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు విజయవంతంగా జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. సాగు ప్రారంభ దశలోనే రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, సకాలంలో వ్యవసాయ పనులు చేపట్టేందుకు అవసరమైన ఆర్థిక చేయూత అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఈ నిధుల విడుదల వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే ముథోల్ నియోజకవర్గంలో 85,468 మంది రైతులకు 118.34 కోట్ల రూపాయలు, ఖానాపూర్ నియోజకవర్గంలో 62,632 మంది రైతులకు 75.31 కోట్ల రూపాయలు, నిర్మల్ నియోజకవర్గంలో 63,752 మంది రైతులకు 69.37 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ అయినట్లు కలెక్టర్ వివరించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణతో చర్యలు చేపడుతోందని, సాంకేతిక లేదా పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా



లీడ్ బ్యాంక్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు.

# నిర్మల్‌లో తెలంగాణ కరాటే ఇన్‌స్పెక్టర్ల సమీక్షా సమావేశం విజయవంతం




నిర్మల్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ కరాటే సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ కరాటే శిక్షణా కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కరాటే ఇన్‌స్పెక్టర్లు, అధికారిక శిక్షకులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే రోజుల్లో నిర్వహించనున్న బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు, డివిజన్ అఫిలియేషన్, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి టోర్నమెంట్ల నిర్వహణతో పాటు తెలంగాణలో కరాటే క్రీడాభివృద్ధికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన కరాటే శిక్షణ అందించడంతో పాటు ప్రతి మండలంలో కరాటేను విస్తరింపజేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇన్‌స్పెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తెజేర్ సింగ్ బాటీయా, కొండూజి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ అమ్ముల భూషణ్ పాల్గొని క్రీడాకారులకు మార్గదర్శనం చేశారు. రానున్న రోజుల్లో మరింత మంది క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటైతే తెలంగాణకు అంధకారమే!

- నిర్మల్ పెన్షనర్ల భవనంలో మేధావులు, వివిధ ప్రజా సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం

నిర్మల్ ఖిల్లా, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
హైదరాబాదును దేశ రెండవ రాజధానిగా చేసి, కేంద్రపాలిత ప్రాంతంగా (యుటి) మార్చాలని కేంద్ర ప్రభుత్వం చురుగ్గా ఆలోచిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఆదివారం నిర్మల్ పెన్షనర్ల భవనంలో టీపీజేఏసీ ఆధ్వర్యంలో మేధావులు, ప్రజా సంఘాల నాయకులతో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణను కేంద్రం చేసుకొని దక్షిణాదిలో రాజకీయంగా పాగా వేయాలని బీజేపీ ఈ వాదనను ముందుకు తెస్తోందని, ఈ కుట్రను తెలంగాణ ప్రజలు ఏకమై తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు కె. వేణుగోపాల్ మాట్లాడుతూ, హైదరాబాద్ మున్సిపల్ పరిధిలోనికి 27 మున్సిపాలిటీలను చేర్చడం, ఔటర్ రింగ్ రోడ్డు దాటి నగరం విస్తరించడం వంటి అంశాలను సాకుగా చూపి కేంద్రపాలిత ప్రాంత ప్రతిపాదన తీసుకురావడం దుర్మార్గమన్నారు. టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు బి. కొండల్ రెడ్డి మాట్లాడుతూ, నీళ్లు, నిధులు, నియామకాల కోసమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఇప్పుడు హైదరాబాద్ ను వేరు చేస్తే నగరం నుండి వచ్చే 60 శాతం ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్రం కోల్పోతుందని, ఉద్యోగాలు స్థానికులకు దక్కకుండా పోతాయన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జె. వి. చలపతి రావు మాట్లాడుతూ, హైదరాబాద్ లేని తెలంగాణ ఏర్పడితే మిగిలిన జిల్లాల ఆదాయం ప్రస్తుత ఆదాయంలో కేవలం 30 నుండి 40 శాతం మాత్రమే ఉండిపోయి, తెలంగాణ అత్యల్ప తలసరి ఆదాయం గల ఒక పేద రాష్ట్రంగా మిగిలిపోతుందన్నారు. టీజెఏసీ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయకుమార్ మాట్లాడుతూ, ఆనాడు హైదరాబాద్ ను ఫ్రీ జోన్ గా ప్రకటించాలనే ప్రతిపాదనను వ్యతిరేకించిన పౌర సమాజం, ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంత ప్రతిపాదనను కూడా నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు వాజిద్ అహ్మద్ ఖాన్, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. ఎన్. రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత పోశెట్టి, అజయ్, ఇఫ్టూ కార్యదర్శి హరిత పాల్గొన్నారు.



# దిలావర్‌పూర్ గ్రంథాలయ అధికారి కటకం సంజీవరెడ్డికి ఘన వీడ్కోలు సన్మానం




దిలావర్‌పూర్, జూలై 5 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మండల కేంద్ర గ్రంథాలయంలో సుదీర్ఘ కాలంగా ఆదర్శవంతమైన సేవలు అందించిన గ్రంథాలయ అధికారి కటకం సంజీవరెడ్డికి స్థానిక యువకులు, విద్యార్థులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన జగిత్యాల జిల్లా సెంట్రల్ లైబ్రేరియన్‌గా పదోన్నతి (ప్రమోషన్) పొందిన నేపథ్యంలో బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో గ్రామ యువకులు, ప్రముఖులు పాల్గొని సంజీవరెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, గ్రంథాలయాన్ని గ్రామీణ యువతకు చేరువ చేయడంలో సంజీవరెడ్డి చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలను ఎప్పటికప్పుడు తెప్పించి తమ ఉద్యోగ సాధనకు తోడ్పడ్డారన్నారు. అనంతరం సంజీవరెడ్డి భావోద్వేగానికి గురవుతూ, దిలావర్‌పూర్ ప్రజలు, యువకులు తనపై చూపిన ఆదరణ మరవలేనిదన్నారు. వృత్తిధర్మంలో భాగంగా బదిలీపై వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో కోడే మహిపాల్, విద్యాసాగర్, పార్థసారథి, కోడె శ్రీనివాస్, నవీన్ రెడ్డి, సాయన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com